సాక్షి
పెద్దపల్లి
శనివారం । 20 । ఏప్రిల్ । 2024



**హోమ్ ఓటింగ్‌పై శిక్షణ**
మంథని: హోమ్ ఓటింగ్‌లో పాటించాల్సిన నిబంధనలపై ఆర్డీవో హనుమా నాయక్ తన కార్యాలయంలో పోలింగ్ అధికారులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు.



**రాజన్న సేవలో..**
వేములవాడ: రాజన్నను కరీంనగర్ నియోజకవర్గ ఎన్నికల వ్యయపరిశీలకుడు అశ్వినిపాండే శుక్రవారం దర్శించుకున్నారు.

**వాతావరణం**
గరిష్టం/కనిష్టం 44.9/27.6
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. వడగాడ్పులు వీచే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



సూచనలిస్తున్న జెడ్పీ సీఈవో నరేందర్

ముత్తారం(మంథని): గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్త కుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈవో నరేందర్ ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాని పేర్కొన్నారు. ఎంపీడీవో లలిత, ఎంపీవో వేణుమాధవ్, ఐకేపీ ఏపీఎం పద్మ, సూపరింటెండెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

### ప్రథమ ప్రాధాన్యం ఇవ్వండి



లద్నాపూర్‌లో పర్యటిస్తున్న ఆశాలత

రామగిరి(మంథని): గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని డీపీవో ఆశాలత సూచించారు. లద్నాపూర్, నాగెపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. తక్షణమే బోరుబావులను మరమ్మతు చేయించాలని ఆదేశించారు. తాగునీటి సమస్య తలెత్తిన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా, ఆర్ అండ్ బీ రోడ్డు విస్తరణలో తాగునీటి పైపులైన్లు ధ్వంసం కావడంపై అధికారులు నిర్లక్ష్యం వహించారని డీపీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీవో సమ్మిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పోశం, సంతోష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పంటకోత ప్రయోగంతో దిగుబడి అంచనా



ప్రయోగం చేస్తున్న అధికారులు

ధర్మారం(ధర్మపురి): వరిలో పంటకోత ప్రయోగం ద్వారా దిగుబడి అంచనా వేస్తామని ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్ అన్నారు. డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ డిప్యూటీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రచ్చపల్లి గ్రామంలోని లక్ష్మయ్య వరి పొలంలో పంటకోత ప్రయోగం చేశారు. 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పుతో పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఇందులో 24.250 కిలోల దిగుబడి వచ్చిందని రవీందర్ తెలిపారు. అనంతరం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలించి కొనుగోళ్లపై ఆరా తీశారు. అధికారులు శ్యాంసుందర్, నగేశ్, లింగారెడ్డి, వెంకటేశ్వర్లు, గురువయ్య, షబానా పాల్గొన్నారు.

### పల్లెప్రకృతి వనం తనిఖీ



పల్లెప్రకృతి వనం పరిశీలిస్తున్న వేణుగోపాల్

సాక్షి స్పందన

ముత్తారం(మంథని): ఖమ్మంపల్లి గ్రామంలోని పల్లె ప్రకృతి వనాన్ని డీఎల్‌పీవో వేణుగోపాల్ శుక్రవారం తనిఖీ చేశారు. 'ఎండుతున్న వనం.. నీరుగారుతున్న లక్ష్యం' శీర్షికన ఈనెల 18న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. మొక్కలు ఎండిపోవడానికి గల కారణాల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అగంతకులు నిప్పుపెట్టడంతో కొన్ని మొక్కలు కాలిపోయాయని, మరికొన్ని నీరందక ఎండిపోయాయని స్థానికులు వివరించారు. మొక్కలను కాపాడే బాధ్యత అందరూ తీసుకోవాలని డీఎల్‌పీవో సూచించారు. మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి రాకేశ్‌ను ఆదేశించారు. ఎంపీడీవో లలిత, ఎంపీవో వేణుమాధవ్ ఉన్నారు.

### ఎల్లంపల్లిలో 6 టీఎంసీల నీరు

రామగుండం: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటినిల్వలు వేగంగా పడిపోతున్నాయి. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా శుక్రవారం 6.79 టీఎంసీలు ఉందని అధికారులు తెలిపారు. గతేడాది ఇదేరోజు 10 టీఎంసీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, హైదరాబాద్‌కు 331 క్యూసెక్కులు, గూడెం పంపుహౌస్‌కు 145 క్యూసెక్కులు, పెద్దపల్లి, మంచిర్యాల, రామగుండంలోని భగీరథ తాగునీటి పథకం కోసం 81 క్యూసెక్కులు పంపింగ్ చేస్తున్నామరు.

# ఎండిన మొక్కలు.. విరిగిన పరికరాలు

## రామగుండం బల్దియాలో పార్కులు నిరుపయోగం

- పర్యవేక్షణ లేక ఆనవాళ్లు కోల్పోయిన ఉద్యాన వనాలు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నగరవాసులు

కోల్‌సిటీ(రామగుండం): నగరవాసులకు ఆహ్లాదం పంచే ఉద్యానవనాలు నిర్వహణ లోపంతో సందర్శకులకు అసంతృప్తి మిగుల్చుతున్నాయి. పచ్చని మొక్కలు, ఏపుగా పెరిగిన చెట్లు, ఆధునిక ఆటవస్తువులు, వ్యాయామ, క్రీడా పరికరాలతో సౌకర్యంగా, అందంగా దిద్దిన పార్కులు కళావిహీనంగా మారాయి. విరిగిన ఓపెన్‌జిమ్ పరికరాలు, తుప్పు పట్టిన ఆటవస్తువులు, ఎండిపోయిన మొక్కలు అధికారులు, నిర్వాహకుల నిర్లక్ష్యానికి అద్దంపడుతున్నాయి.

**పార్కుల నిర్వహణ గాలికి..**

రామగుండం నగరవాసులకు ఆహ్లాదం పంచడానికి సుమారు రూ.3కోట్ల పైచిలుకు నిధులతో వివిధ ప్రాంతాల్లో ఉద్యాన వనాలు ఏర్పాటు చేశారు. చిన్నారులు ఆడుకోవడానికి క్రీడాపరికరాలు, జారుడు బల్లలు, మహిళలు, యువత కోసం వ్యాయామ పరికరాలు, పాదచారులు నడిచేందుకు వాకింగ్ ట్రాక్‌తోపాటు ఓపెన్‌జిమ్‌లు కూడా నిర్మించారు. ఇంతసౌకర్యవంతమైన పార్కుల్లోకి వెళ్లి సరదాగా గడుపుదామనుకునే స్థానికులకు చేదు అనుభవం ఎదురవుతోంది. ఇంజినీరింగ్ విభాగం అధికారులు కూడా సకాలంలో టెండర్లు పిలిచి నిర్వహణ బాధ్యతలను చేపట్టడం లేదు.

ఇది రామగుండం బల్దియాలోని దుర్గానగర్ ఉద్యానవనం. అమృత్ పథకం ద్వారా విడుదలైన నిధుల్లోంచి రూ.50లక్షలు వెచ్చించి 2017 మార్చిలో పార్కు అభివృద్ధి చేశారు. మరో రూ.20 లక్షల పట్టణ ప్రగతి నిధులు వెచ్చించి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. కానీ రెండేళ్లుగా నిర్వహణ విస్మరించారు. ఫలితంగా బోర్‌వెల్ నుంచి చుక్క నీరు రావడం లేదు. నీళ్లు అందక మొక్కలు ఎండిపోయాయి. పిల్లల ఆటవస్తువులు పనికిరాకుండా పోయాయి. వేసవి సెలవులు కావడంతో చిన్నారులు ఆడుకోవడానికి పార్కుకు వస్తే పనికిరాని ఆటవస్తువులు వెక్కిరిస్తున్నాయి. ఓపెన్ జిమ్ పరికరాల మరమ్మతు చేయించలేదు. తాగిపడేసిన మద్యం బాటిళ్లు, సిగరెట్ ముక్కలు సందర్శకులకు ఇబ్బందులుకలిగిస్తున్నాయి. గౌతమినగర్‌లోనూ రూ.70లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ నిరుపయోగంగా మారింది.



- ఇది టీచర్స్‌కాలనీలోని పార్కు. ఇందిరమ్మకాలనీ, టీచర్స్‌కాలనీ, గంగానగర్, విఠల్‌నగర్‌లో రూ.1.50కోట్లు వెచ్చించి ఉద్యాన వనాలు నిర్మించారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో టీచర్స్ కాలనీ పార్కులోని మొక్కలు ఎండిపోతున్నాయి. చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. ఇటీవల విషసర్పం సంచరించడంతో సందర్శకులు, కాలనీవాసులు భయంతో వణికిపోయారు. గంగానగర్ పార్కు పరిస్థితి కూడా అధ్వానంగా మారింది. నీళ్లు అందక పచ్చని మొక్కలు, పచ్చని గడ్డి ఎండిపోతున్నాయి.





- వేసవి సెలవుల్లో పిల్లలు ఆడుకునేందుకు పార్కుల్లో ఏర్పాటు చేసిన ఆటవస్తువులు, క్రీడాపరికరాలు తుప్పుపట్టి, విరిగిపోయాయి. ఎంతోఆశతో ఉద్యానవనాలకు వస్తున్న చిన్నారులు.. వీటిని చూసి ఎలా ఆడుకునేదని నిశ పడుతున్నారు. ఒక్కపార్కులోని ఆటవస్తువులు కూడా సరిగాలేవు. పరికరాలను అమర్చినన అధికారులు.. ఏనాడూ వాటి నిర్వహణ, మరమ్మతు గురించి పట్టించుకున్న పాపాన పోలేదనే విమర్శలు ఉన్నాయి.

### తుప్పు పట్టాయి



పచ్చని మొక్కలు, పిల్లల క్రీడా సామగ్రితో ఒకప్పుడు కళకళలాడిన పార్కు.. ఇప్పుడు ఎండిన మొక్కలతో అధ్వానంగా తయారైంది. పిల్లలు ఆడుకునే పరికరాలు విరిగిపోయాయి. కొన్ని తుప్పు పట్టాయి. బోర్ నుంచి నీళ్లు రావడం లేదు. మొక్కలు ఎండిపోతున్నాయి.
– సంధ్యారాణి, గంగానగర్, గోదావరిఖని

### అభివృద్ధి చేయాలి



అధికారులు పార్కుపై పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు. మోడల్ పార్కుగా అభివృద్ధి చేయాలి. ఆకతాయిలు పార్కులోనే మద్యం తాగుతున్నారు. పిల్లల ఆటవస్తువులు విరిగిపోయాయి. బాత్‌రూంకు నీటి సరఫరా లేదు. నీళ్లలేక మొక్కలు ఎండిపోతున్నాయి.
– ఇందారపు సతీశ్, దుర్గానగర్, గోదావరిఖని

### చర్యలు తీసుకుంటాం



నగరంలోని పార్కుల పరిస్థితి, వాటిలోని సమస్యలు తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తాం. వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపడతాం. మొక్కలు ఎండిపోకుండా నీళ్లు అందిస్తాం. ఉద్యాన వనాలకు పూర్వవైభవం తీసుకువచ్చేలా ప్రణాళిక సిద్ధం చేస్తాం. – శ్రీకాంత్, కమిషనర్, నగరపాలక సంస్థ, రామగుండం

# రెండోరోజు ముగ్గురు..



కుటుంబ సభ్యులతో కలిసి నామినేషన్ దాఖలు చేస్తున్న గడ్డం వంశీకృష్ణ



కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు నామినేషన్ దాఖలు చేస్తున్న కొప్పుల ఈశ్వర్, కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి

- సాదాసీదాగా నామినేషన్ వేసిన కొప్పుల, వంశీ
- అగ్రనేతల ఆధ్వర్యంలో మరోసెట్ వేయనున్న అభ్యర్థులు
- ఇప్పటివరకు ఏడుగురు అభ్యర్థుల నామినేషన్ దాఖలు

సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి ఎంపీ స్థానానికి రెండోరోజు ముగ్గురు 5సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం ఏకదాశి మంచిరోజు కావడంతో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్.. మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్‌తో కలిసి రెండుసెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ.. ఎమ్మెల్యేలు విజయరమణారావు, అడ్లూరి లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెల, నేతకాని సంఘం రాష్ట్ర కార్యదర్శి దుర్గం నరేశ్‌తో కలిసి ఒకసెట్ నామినేషన్ పత్రం దాఖలు చేశారు. ఆ తర్వాత తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి మరోసెట్ అందజేశారు. వీరుకాకుండా బీఆర్ఎస్ తరఫున కొంకటి లింగమూర్తి ఒక సెట్ నామినేషన వేశారు. వీరితో ఇప్పటివరకు ఏడుగురు నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ నామినేషన్ కోసం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రావాల్సి ఉండగా అనివార్యకారణాలతో ఆయన రాలేకపోయారు. దీంతో సాదాసీదాగానే నామినేషన్ వేశారు. మరోసారి అగ్రనేతల సమక్షంలో భారీ ర్యాలీలతో మరోసెట్ నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

### ప్రాజెక్టులు తీసుకొస్తా

మా తాత అడుగుజాడల్లో ప్రజాసేవ చేయడానికి రా జకీయాల్లోకి వచ్చా. పదే ళ్ల బీఆర్ఎస్ పాలనలో ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదు. నేను, మా నాన్న సక్సెస్‌ఫుల్ వ్యాపారులం. ఆ అనుభవంతో ఇక్కడకు కొత్త ప్రాజెక్టులు తీసుకొచ్చి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.
– గడ్డం వంశీకృష్ణ, కాంగ్రెస్ అభ్యర్థి

### ఇక్కడే పుట్టిన

ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగిన. గెలిచినా, ఓడినా ప్రజల మధ్యే ఉంటా. ఇక్కడే చస్తా. సింగరేణి లో 26 ఏళ్లు కార్మికుడిగా పనిచేసిన. ఎక్కడినుంచో వచ్చేవారిని కాకుండా ఉద్యమాల నుంచి వచ్చిన నన్ను గెలిపించాలని కోరుకుతున్నా. మాయమాటల కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓట్లతో బుద్ధిచెప్పాలి.
– కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ అభ్యర్థి

# నిప్పుల కొలిమి

- జిల్లాలో గరిష్టంగా 44.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు
- భయపెడుతున్న వడగాడ్పులు



సాక్షి, పెద్దపల్లి: భానుడి భగభగలతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో శుక్రవారం ఉష్ణోగ్రతలు 40డిగ్రీలు దాటాయి. అత్యధికంగా కల్వచర్లలో 44.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 8గంటల నుంచే భానుడు ఉగ్రరూపం చూపుతుండటంతో జనం ఇళ్లు విడిచి బయటకు రావడానికి జంకుతున్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలెవరూ బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతోంది. అత్యవసర పనులు ఉంటే తప్ప ఇళ్లు విడిచి బయటకు రావటం లేదు. ఎండలు దంచికొడుతుండడంతో పగటిపూట జనసంచారం తగ్గి వ్యాపారాలు డీలా పడుతున్నాయి. రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. సాయంత్రం నుంచి రాత్రి 10గంటల వరకు ప్రజలు తమ అవసరాలు తీర్చుకుకంటున్నారు. రాత్రిపూటే పనులు చేసుకుంటున్నారు.

శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లో)

| ప్రాంతం | ఉష్ణోగ్రతలు |
|---|---|
| కల్వచర్ల | 44.9 |
| కాల్వశ్రీరాంపూర్ | 44.6 |
| మల్యాల | 44.4 |
| మంథని | 44.4 |
| కూనారాం | 44.3 |
| రామగుండం | 44.1 |
| ఆకినపల్లి | 44.1 |





# అకాల వర్షం.. తడిసిన ధాన్యం



సుల్తానాబాద్ రూరల్ : ధాన్యంలో నుంచి పోతున్న వర్షపునీరు





సుల్తానాబాద్ రూరల్ : ధాన్యంలో నిలిచిన వడగండ్లు, ధాన్యంలో నుంచి నీరు తోడేస్తున్న రైతు

సుల్తానాబాద్‌రూరల్: వివిధ గ్రామాల్లో శుక్రవారం కురిసిన వడగళ్ల వర్షంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితి ఆగమాగమైంది. ప్రధానంగా కనుకుల, తొగర్రాయి, మంచిరామి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం వర్షంతో తడిసిపోయింది. అందులో నీటిని తొలగించేందుకు రైతులు నానాపాట్లు పడ్డారు. నిర్దేశిత తేమశాతం వచ్చినా నిర్వాహకులు సకాలంలో ధాన్యం కొనుగోలు చేయలేదని, దీంతో అకాల వర్షంతో తడిసిపోయిందని పలువురు రైతులు ఆవేదన చెందారు.

**ఓదెలలో..**

ఓదెల(పెద్దపల్లి): కొలనూర్, ఓదెల, పొత్కపల్లి, ఉప్పరపల్లె, హరిపురం, పిట్టలపల్లెలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందారు. ఆ వెంటనే కొనుగోలు కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యం కుప్పలపై టార్పాలినట్లు కప్పారు.

## రాష్ట్రంలో అరాచక పాలన

- పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ధ్వజం



మాట్లాడుతున్న మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్

సుల్తానాబాద్(పెద్దపల్లి): రాష్ట్రంలో నాలుగు నెలల నుంచి అరాచక పాలన కొనసాగుతోందని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. శుక్రవారం రాత్రి స్థానిక కౌన్సిలర్ గొట్టం లక్ష్మి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, తమ పార్టీకి ఓట్లు వేయలేదని, కక్షగట్టి దాడులు చేయడం మానుకోవాలని కోరారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా ఫ్రెండ్లీ పోలీసింగ్ పద్ధతి అమలు చేశామని, అయితే, పోలీసులు ప్రస్తుతం బైండోవర్లు, బెదిరింపులు చేస్తున్నారని, ఆ పద్ధతి మానుకోవాలని కోరారు. ప్రజలకు తమ పార్టీ అండగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్, తాళ్లపెల్లి ఆగయ్య ఫౌండేషన్ చైర్మన్ తాళ్లపల్లి మనోజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దులు దాటుతున్న రేషన్ బియ్యం

- వ్యాపారుల మధ్య వార్‌తో పట్టుబడుతున్న బియ్యం
- గోదావరి బ్యారేజీ, వంతెనలపై అక్రమ రవాణా

మంథని: పేదలకు చేరాల్సిన రాయితీ బియ్యం సరిహద్దులు దాటుతోంది. అయినా, అధికారులు పట్టించుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిత్యం వందలాది క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతోంది. అయితే, ఉప్పందుకుంటున్న ఉన్నతాధికారులు ఆయా ప్రాంతాల్లో మాటువేసి పట్టుకుంటున్నారు. వ్యాపారుల మధ్య నెలకొన్న వార్ నేపథ్యంలో వారంరోజుల వ్యవధిలోనే మంథనిలో రెండుసార్లు రేషన్ బియ్యం అధికారులకు పట్టుబడటం గమనార్హం. మరోవైపు.. అక్రమ దందాపై అధికారులకు సమాచారం ఉన్నా నిలువరించడంలో పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంతకాలం గుట్టుచప్పుడు కాకుండా సాగిన అక్రమ వ్యాపారం.. అక్రమార్కుల మధ్య వైరంతో బట్టబయలు కావడం గమనార్హం.

**వారధులుగా బ్యారేజీ.. వంతెనలు**

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా గోదావరి నదిపై నిర్మించిన బ్యారేజీలు, వంతెనలు ప్రజా రవాణాకు కంటే అక్రమ దందాలకు వారధులుగా మారుతున్నాయి. అక్రమార్కులు ప్రధానంగా సబ్సిడీ బియ్యాన్ని సరిహద్దులు దాటిస్తున్నారని సమాచారం ఉంది. పేద, మధ్య తరగతితోపాటు ఉన్నత వర్గాలకు చెందిన అనేకమందికి రేషన్‌కార్డుల ద్వారా వచ్చే బియ్యం.. లబ్ధిదారులు తీసుకోకుండా డీలర్లకే విక్రయిస్తుండడంతో డీలర్లు వాటిని సేకరించి పక్కదారి పట్టిస్తున్నారనే విమర్శలున్నాయి.



పట్టుబడిన రేషన్ బియ్యం(ఫైల్)



సిరిపురం సమీపంలోని పార్వతీ బ్యారేజీ, వంతెన

**మంథని నుంచి మహారాష్ట్రకు..**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాతోపాటు పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని, పెద్దపల్లి సమీప ప్రాంతాల నుంచి మంథనికి చెందిన ఓ వ్యాపారి బియ్యం సేకరించి మహారాష్ట్రలోని సిరొంచకు తరలిస్తున్నట్లు సమాచారం. ఇటీవల మరికొందరు వ్యాపారులు ఇదే దందాకు తెరలేపడంతో వ్యాపారుల మధ్యపోటీ పెరిగింది. ఈక్రమంలో ఒకరు వాహనం మరొకరు ఉన్నతాధికారులకు పట్టిస్తున్నారు. దీంతో అధికారులు ఏంచేస్తున్నట్లు అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**పోలీసులకు చిక్కుండా..**

సేకరించిన బియ్యాన్ని మహారాష్ట్రకు తరలించే క్రమంలో పోలీసులకు చిక్కకుండా అక్రమార్కులు నిఘాలేని మార్గాలను ఎంచుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే మంథని మండలం సిరిపురం సమీపంలోని పార్వతీ బ్యారేజీ మీదుగా మంచిర్యాల జిల్లా దాటి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని సరస్వతీ బ్యారేజీ, వంతెన.. అటుతర్వాత దామెరకుంట, కాళేశ్వరం, అంతర్‌రాష్ట్ర వంతెన దాటి మహారాష్ట్రలోకి బియ్యాన్ని చేర్చుతున్నట్లు సమాచారం. మంథని నుంచి తరలించే బియ్యం వాహనాల్లో లోడ్ అయ్యే వరకూ ఇక్కడి వ్యాపారి.. అటుతర్వాత తీసుకెళ్లే బాధ్యత మరో వ్యాపారి తీసుకొని అక్రమ దందాను మూడు లారీలు.. ఆరు వ్యాన్లు అన్నచందంగా రూ.లక్షల్లో దందా సాగిస్తున్నట్లు తెలిసింది.

**6ఏ కేసులతో సరి..**

జిల్లాలో పలుచోట్ల సబ్సిడీ బియ్యం పట్టుబడుతుంటే అప్పటికప్పుడు 6ఏ కేసులతో సరిపెడుతున్నారు. ఈ బియ్యం ఎక్కడి నుంచి వచ్చాయి? ఆ వ్యాపారి ఎవరు? అనే కోణంలో అధికారులు దృష్టి సారించడం లేదని విమర్శలు ఉన్నాయి. మూలాల్లోకి వెళ్లకపోవడంతో వ్యాపారులు దందాను ఆపడం లేదు. ఒకట్రెండుసార్లు పట్టుబడితే వారిపై పీడీ యాక్టు నమోదుకు అవకాశం ఉన్నా.. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కొంతమంది వ్యాపారులు బినామీ పేర్లను వినియోగిస్తూ కేసులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులు దృష్టి సారిస్తే అక్రమ దందా ఆపవచ్చనే వాదనలు ఉన్నాయి.

### నిఘా పెంచాం

ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే బియ్యం పక్కదారి పట్టకుండా నిఘా పెట్టాం. గ్రామాల్లో వీఆర్వోలు, ఆర్ఐల ద్వారా అనుమానితుల కదలికలు గమనిస్తున్నాం. 6ఏ కేసులతో పాటు పదేపదే పట్టుబడితే వ్యాపారులపై పీడీ యాక్టు నమోదుకు సిఫారసు చేస్తాం. సబ్సిడీ బియ్యం పక్కాదారి పడుతున్న సమాచారం అందిస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. అక్రమార్కులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.
– ప్రకాశ్, తహసీల్దార్, మంథని

## క్లుప్తంగా

### ఆస్పత్రి సిబ్బంది విధుల బహిష్కరణ



నిరసన తెలుపుతున్న కార్మికులు

పెద్దపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి వెంటనే వేతనాలను ఇప్పించాలంటూ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి, కేవీపీఎస్ నాయకులు అశోక్, రవీందర్ డిమాండ్ చేశారు. వీరి ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బంది విధులు బహిష్కరించారు. శానిటేషన్, పేషంట్‌కేర్, సెక్యూరిటీ తదితర విభాగాల్లో పనిచేసే కార్మికులకు ఏడాదిగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. దీంతో వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడి కార్మికుల సమస్యకు పరిష్కారం చూపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, శివ, కుమార్, సతీశ్, నాగేంద్ర, భూలక్ష్మి, లావణ్య, రేణుక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### బావిలోపడి వృద్ధురాలి మృతి

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓదెల గ్రామానికి చెందిన చింతం లక్ష్మి(74) శుక్రవారం వ్యవసాయబావిలో పడి మృతిచెందింది. ఏఎస్సై లక్ష్మీరాజం కథనం ప్రకారం.. ఓదెల గ్రామానికి చెందిన చింతం లక్ష్మి రెండు సంవత్సరాల నుంచి కీళ్ల నొప్పులతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయం కాలేదు. నొప్పి భరించలేక బహిర్భూమికని వెళ్లి బావిలోపడి మృతిచెందింది. మృతురాలి కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

### ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ



రోడ్డుపై పడిన ధాన్యం

సుల్తానాబాద్‌రూరల్: కాట్నపల్లి గ్రామ శివారులోని రాజీవ్ రహదారిపై ధాన్యం లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను లారీ వెనుక నుంచి ఢీకొంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గర్రెపల్లిలోని ఐకేపీ కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం లోడ్‌తో ట్రాక్టర్ సుల్తానాబాద్‌కు వస్తోంది. ఈక్రమంలో కరీంనగర్ నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ బోల్తాపడగా డ్రైవర్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. అయితే, అందులో ధాన్యం రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయింది. దాదాపు గంటకుపైగానే వాహనాలు నిలిచి ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

### ఉబికి వస్తున్న నీళ్లు



రామగుండం: స్థానిక రైల్వే లోకోపైలట్ల విశ్రాంతి భవనం పక్కన నాలుగేళ్ల క్రితం తాగునీటి అవసరాల నిమిత్తం వేసిన బోరు నుంచి నీరు ఉబికి వస్తోంది. వేసవిలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్న క్రమంలోనూ బోరు నుంచి నీరు పైకి రావడం గమనార్హం. వివిధ జిల్లాల నుంచి విధులకు హాజరయ్యే లోకోపైలట్లు బోర్‌వెల్ నుంచి వచ్చే ఆకాశగంగను చూసి ఆశ్చర్యపోతున్నారు.





### పండుకు రక్షణ

పక్షులు, కోతులు, చీడపీడలు, తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవడానికి పెద్దపల్లి జిల్లా కేంద్రానికి చెందిన ఓ ఇంటి యజమాని తన పెరటిలోని మామిడి చెట్టుకు కాసిన కాయలకు సంచి కట్టాడు. ఈసారి మామిడి విరగ కాసిందని తెలిపాడు. వడగాలులు, సూర్య కాంతికి రంగుమారకుండా, కాయ కింద పడ్డా దెబ్బతినకుండా రక్షణ కోసం మామిడి కాయలకు సంచులు ఇలా కట్టాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



### రోడ్డుపైనే ధాన్యం ఆరబోసి..

వరి కోతలు జోరందుకుంటున్నాయి. ధాన్యం కొనుగోళ్ల వేగంగా సాగుతున్నాయి. అయితే, వడ్లలో నిర్దేశిత తేమశాతం వచ్చేందుకు రైతులు పడనా పాట్లు లేవు. కొందరు పొలాల్లోని కల్లాల వద్ద, మరికొందరు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోస్తున్నారు. మరికొందరు తమకు సమీపంలోని రోడ్లపైనే ఆరబోస్తూ తేమశాతం వచ్చేలా చూస్తున్నార. ఈక్రమంలోనే ఓదెల మండలం మడక గ్రామ శివారులో మక్కలు, వడ్లను ఇలా రోడ్లపైనే ఆరబోస్తూ కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



# నీటిబొట్టు.. ఒడిసిపట్టు

- తాగునీటి అవసరాల కోసం బొగ్గు గనుల్లోని వృథా నీరు
- సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తున్న అధికారులు

గోదావరిఖని: 'నీటి బొట్టును వృథా చేయవద్దు.. ప్రతీచుక్కను ఒడిసి పట్టాలి.. బొగ్గు బావుల్లోంచి వచ్చే నీటిని ప్రజావసరాలకు మళ్లించాలి' అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఇటీవల ఆదేశించారు. గోదావరినదిలో నీరు అడుగంటడంతో సింగరేణి బొగ్గు బావుల్లోంచి వెలువడే వృథా నీటిని శుద్ధి చేసి జిల్లా వాసులకు అందించాలని సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా పొంచి ఉన్న తాగునీటి ముప్పుపై అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. మరో రెండు నెలలపాటు పట్టణాలు, గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టింది.

**సింగరేణి అధికారులతో భేటీ..**

వేసవిలో తలెత్తబోయే తాగునీటి ముప్పును అధిగమించేందుకు సింగరేణి బొగ్గు గనుల్లోంచి వెలువడే వృథా నీటిని వినియోగించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ నిర్ణయించారు. ఈమేరకు సింగరేణి అధికారులతో ఆయన ఇటీవల ఇదేవిషయంపై సమీక్షించారు. రామగుండం రీజియన్‌లోని మూడు ఏరియాల్లో ఉన్న గనుల్లోంచి ఎంత నీరు వెలువడుతోంది? యాజమాన్యం ఎంత వినియోగిస్తోంది? వృథాగా పోతున్నదెంత? తదితర అంశాలపై అధ్యయనం చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. గనుల్లోంచి రోజూ దాదాపు 132 ఎంఎల్‌డీ నీరు పంపింగ్ చేస్తున్నారు. ఇందులోంచి సింగరేణి అవసరాలకు పోను సుమారు 100 ఎంఎల్‌డీ నీటిని వ్యవసాయ రంగానికి సరఫరా చేస్తున్నారు. ఈక్రమంలోనే సమీప గ్రామాలు, పట్టణాలకు బొగ్గు గనుల నీరు మళ్లించాలని ప్రణాళిక రూపొందిస్తున్నారు.

**చెరువుల్లోకి వృథా నీరు..**

- ప్రధానంగా ఆర్జీ–2, 3 ఏరియాల్లోని జల్లారం, బొక్కల వాగులో కలుస్తున్న వృథా నీటిపై అధికారులు దృష్టి సారించారు
- ఆర్జీ–1 నుంచి విడుదలయ్యే నీటిని ఎర్రచెరువు, నల్లచెరువులు, ఆర్జీ–2 నుంచి వెలువడే నీటిని జల్లారం వాగు, ఆర్జీ–3 నుంచి విడుదలయ్యే నీటిని బొక్కల వాగుకు మళ్లిస్తున్నారు.
- ఈనీటిని తాగునీటి అవసరాలకు వినియోగించేందుకు గల సాధ్యాసాధ్యాలపై అధికారులు దృష్టి సారించారు.
- వృథానీటిని ఆర్వోప్లాంట్ ద్వారా శుద్ధి చేసి ప్రస్తుతం అందుబాటులో ఉన్న పైప్‌లైన్ వ్యవస్థ ద్వారానే తాగునీటిగా వినియోగించుకోవాలని సింగరేణి అధికారులు సూచించారు.
- తొలుత రామగుండం, పరిసర గ్రామాలకు ప్రజలకు తాగునీరు సరఫరా చేసే అంశంపై అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.
- ఈ క్రమంలో అధికారులు ఈ రెండు ఏరియాల్లో పర్యటించారు.



వృథానీటి పరిశీలన కోసం సింగరేణి బొగ్గు గనుల ఏరియాలో పర్యటిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ(ఫైల్)



బొగ్గుబావి నుంచి వస్తున్న వృథానీరు

### సహకరిస్తాం



బొగ్గు గనుల్లోంచి వెలువడే వృథా నీటిని పంటలకు మళ్లిస్తున్నాం. ప్రధానంగా చెరువులు, కుంటల్లోకి మళ్లించి ప్రజావసరాలకు వినియోగిస్తున్నాం. ప్రస్తుతం యాసంగిసీజన్ పంటలకు నీటి అవసరం తీరింది. ఈ నీటిని తాగునీటి అవసరాలకు వినియోగించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. ఈమేరకు మిషన్ భగీరథ అధికారులు ఏరియాలో పర్యటించి సాధ్యసాధ్యాలపై అధ్యయనం చేస్తున్నారు. జిల్లావాసుల దాహం తీర్చేందుకు మాస్థాయిలో సహకరిస్తాం.

– శ్రీనివాస్, ఆర్జీ–1 జీఎం

# పాలిటెక్నిక్‌లో ప్రవేశాలు

పెద్దపల్లిరూరల్: ప్రవేశ పరీక్ష రాయకున్నా దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ శిక్షణ సంస్థలో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు ఆసక్తి గల అనాథ, నిరుపేద బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా సంక్షేమ శాఖ అధికారి రవుఫ్‌ఖాన్ తెలిపారు. హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ పాలిటెక్నిక్‌లో ప్రవేశం పొందేందుకు టెన్త్ పూర్తయి, ఉండి తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ, పాక్షిక అనాథ, నిరుపేద బాలికలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మూడు సంవత్సరాల కాలపరిమితి గల డిప్లొమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్, ఈసీఈ, ఈఈఈ, డిప్లొమా ఇన్ కంప్యూటర్స్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఎంపికైన బాలికలకు ఉచిత విద్య, వసతి కల్పిస్తారని పేర్కొన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 18వ తేదీలోగా బాలరక్ష భవన్ కార్యాలయంలో అందించాలని కోరారు. పూర్తివివరాలకు సెల్ నంబరు 90324 27241లో సంప్రదించాలని ఆయన కోరారు.

### ఆర్డీవో కార్యాలయంలో హెల్ప్‌లైన్

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తలెత్తే సందేహాలను నివృత్తి చేసేందుకు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు సహాయ ఎన్నికల అధికారి గంగయ్య శుక్రవారం తెలిపారు. పార్లమెంట్ పరిధి పెద్దపల్లి అసెంబ్లీ పరిధిలోని సందేహాల నివృత్తి, ఫిర్యాదుల కోసం ఆర్డీవో కార్యాలయంలో 93989 93638 హెల్ప్‌లైన్ అందుబాటులో ఉంచామని వివరించారు.

# కార్మిక హక్కులు కాలరాస్తున్న బీజేపీ

- ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులు కాలరాస్తోందని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ విమర్శించారు. స్థానిక ప్రెస్‌భవన్‌లో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజా, కార్మిక. రైతు వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్రప్రభుత్వాన్ని లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమాన్ని విస్మరించడంతోనే గత అసెంబ్లీలో ఓటమి పాలైందని గుర్తుచేశారు. గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు మెరుగైన వేతనాలు చెల్లించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజయ్య, ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు ఇ.నరేశ్, రాష్ట్ర కార్యదర్శి వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, నాయకులు రాజనర్సు, రమేశ్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



### గుంతలు.. తిప్పలు

పాలకుర్తి మండలం కుర్మపల్లి ప్రధాన చౌరస్తా పెద్దగుంతలు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. బసంత్‌నగర్ నుంచి ధర్మారం వెళ్లే ఈ మార్గంలో నిత్యం వందలాది లారీలు నడుస్తుంటాయి. వాటిధాటికి రోడ్డు శిథిలమై గుంతులుగా ఏర్పడిందని గ్రామస్తులు తెలిపారు. గుంతలు పూడ్చకపోవడంతో ఈ మార్గంలో ప్రయాణం నరకం చూపిస్తోందని, తక్షణమే అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

# ముగ్గురు మహిళా కూలీలకు గాయాలు



సంఘటన స్థలంలో బండరాయి



చికిత్స పొందుతున్న కాల్వల లింగమ్మ



గాయపడి చికిత్స పొందుతున్న బుర్ర స్వరూప



గాయపడిన కాల్వల లింగమ్మ

సుల్తానాబాద్‌రూరల్/సుల్తానాబాద్(పెద్దపల్లి): ఉపాధిహామీ ద్వారా సుద్దాల పెద్దమ్మకుంటలో శుక్రవారం పూడికతీస్తున్న కూలీలపై బండరాయి దొర్లి, మట్టిపెళ్లలు పడ్డాయి. ఈఘటనలో ముగ్గురు మహిళా కూలీలకు గాయాలయ్యాయి. ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, స్థానికుల కథనం ప్రకారం.. పెద్దమ్మకుంట పూడికతీత పనుల్లో 163 మంది కూలీలు పనిచేస్తున్నారు. అందులో 20 మంది ఒక బృందంగా ఏర్పడి పూడిక తీస్తుండగా గట్టు కుంగి దానిపై ఉన్న బండరాయి కిందకు జారిపడింది. ఆ క్రమంలోనే మట్టిపెళ్లలు తగిలి అక్కడ పనిచేస్తున్న మహిళా కూలీలు ఆవునూరి తార, కల్వల లింగమ్మ, బుర్ర స్వరూపకు గాయాలయ్యాయి. తోటికూలీలు వెంటనే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని మరో ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న ఈజీఎస్ ఏపీడీ సత్యనారాయణ ఆస్పత్రికి వెళ్లి కూలీలను పరామర్శించారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కొత్తపల్లి(కరీంనగర్): బైక్‌ను మరో బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కొత్తపల్లి మండలంలోని చింతకుంట శాంతినగర్‌కు చెందిన ఠాకు విశాల్ శుక్రవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై కమాన్‌పూర్ పెట్రోల్ బంకుకు వెళ్లాడు. పెట్రోల్ కొట్టించుకొని, తిరిగి వస్తూ డివైడర్ దాటుతుండగా భూమి రాకేశ్ బైక్‌పై వేగంగా వచ్చి, ఢీకొట్టాడు. ఈ ఘటనలో విశాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో కరీంనగర్ వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తల్లి కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# సోషల్ వెల్ఫేర్ స్కూల్లో ఫుడ్ పాయిజన్

- 20 మంది విద్యార్థులకు అస్వస్థత

సుల్తానాబాద్: సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కావడంతో 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రినగర్ ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో శుక్రవారం ఉదయం టిఫిన్ చేసిన విద్యార్థులకు వాంతులు, విరేచనాలయ్యాయి. సిబ్బంది వెంటనే వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నలుగురు నలుగురు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో సెలైన్ ఎక్కించారు. మిగిలిన వారి ఆరోగ్యం సాయంత్రం వరకు కుదుటపడటంతో హాస్టల్‌కు తరలించినట్లు డాక్టర్ వెంకటేశ్ తెలిపారు. అల్పాహారంలో ఆయిల్ ఎక్కువ వాడటం వల్ల పిల్లలు అస్వస్థతకు గురైనట్లు వైద్యులు తెలిపారు. హాస్టల్‌కు పంపించిన పిల్లలకు స్టాఫ్ నర్స్ ఆధ్వర్యంలో కొబ్బరి బోండాలు, గ్లూకోజ్ అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సత్యప్రసాద్ రాజు పేర్కొన్నారు.

### స్వగ్రామానికి మృతదేహం

మేడిపల్లి(జగిత్యాల): దమ్మన్నపేటవాసి నిమ్మ రాజశేఖర్ ఈ నెల 3న సౌదీ అరేబియాలో గుండెపోటుతో మృతి చెందగా ఆయన మృతదేహం శుక్రవారం స్వగ్రామం చేరింది. ఉపాధి కోసం వెళ్లి, విగతజీవుడై రావడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. శనివారం అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు.

# రైలు కింద పడి బాలిక బలవన్మరణం

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామ శివారులోని రైల్వే బ్రిడ్జిపై ఒడిశా రాష్ట్రానికి చెందిన కైకేయి(15) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుందని ఎస్సై సదాకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన మన్మద తన కుటుంబ సభ్యులతో కలిసి చల్‌గల్ శివారులోని ఇటుక బట్టీల్లో పని చేస్తోంది. గురువారం జగిత్యాల మార్కెట్‌కు వచ్చి, సాయంత్రం తిరిగి వెళ్తున్నప్పుడు కైకేయి అదృశ్యమైంది. రాత్రి ఆమె కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కొన్ని రోజులుగా కైకేయి మానసిక పరిస్థితి సరిగా ఉండటం లేదని కుటుంబసభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం రైల్వేట్రాక్‌పై ఆమె మృతదేహం ఉందన్న సమాచారంతో ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని, విచారణ చేపట్టారు. మృతురాలి తల్లి మన్మద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి పేర్కొన్నారు.

# ఆరుగురు ఆర్టీసీ ఉద్యోగుల సరెండర్!

హుజూరాబాద్: స్థానిక ఆర్టీసీ డిపోలోని ఆరుగురు ఉద్యోగులను ఆర్ఎం కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. వారు శుక్రవారం ఆర్ఎం ఆఫీస్‌లో రిపోర్టు చేసినట్లు తెలిసింది. ఇటీవల ఓ డ్రైవర్ వద్ద హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం విదితమే. ఈ క్రమంలో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఇందులో డీఎం అవినీతి అక్రమాలకు సహకరించినట్లు తేలిన డిపో పరిధిలోని ఆరుగురు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. డీఎం శ్రీకాంత్ చిన్న చిన్న కారణాలు చూపుతూ, అనుమతి లేకుండా అత్యవసరంగా సెలవులు తీసుకున్న ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసి, డబ్బులు డిమాండ్ చేయడం, ఇవ్వని పక్షంలో పలువురికి చార్జ్ మెమోలు ఇచ్చినట్లు తేల్చారని సమాచారం. వాటిని విజిలెన్స్ అధికారులు సీజ్ చేసి, కరీంనగర్ ఆర్ఎం కార్యాలయానికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

**ఇన్‌చార్జి డీఎంగా వెంకటేశ్వర్లు..**

హుజూరాబాద్ ఇన్‌చార్జి డీఎంగా హుస్నాబాద్ డీఎం వెంకటేశ్వర్లును నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.

# నీటితొట్టెలో పడి బాలుడి మృతి



పరమేశ్వర్ మృతదేహం

మేడిపల్లి(జగిత్యాల): ఓ బాలుడు నీటితొట్టెలో పడి మృతిచెందిన ఘటన మేడిపల్లి మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని బేల గ్రామానికి చెందిన బైగాని సాంబారి ఉపాధి నిమిత్తం తన ఇద్దరు పిల్లలను తీసుకొని, 4 నెలల క్రితం మేడిపల్లికి వచ్చింది. స్థానిక ఇటుకల బట్టీలో పని చేస్తోంది. ఆమె కుమారుడు పరమేశ్వర్(7) గురువారం రాత్రి సమయంలో తోటి పిల్లలతో ఆడుకుంటూ వెళ్లి, దగ్గరలో ఉన్న నీటితొట్టెలో పడిపోయాడు. మిగతా పిల్లలు ఈ విషయాన్ని స్థానికులకు చెప్పడంతో వచ్చి, పరమేశ్వర్‌ని బయటకు తీసి, జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆ బాలుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తల్లి సాంబారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

**నెల రోజుల్లో ముగ్గురు..**

నెల రోజుల్లో ఒక వలస కార్మికుడు, ఇద్దరు కార్మికుల పిల్లలు మృతిచెందారు. దీంతో వలస కార్మికులకు రక్షణ చర్యలు కరువయ్యాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.

**వ్యవసాయ బావిలో పడి వృద్ధురాలు..**

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓదెల గ్రామానికి చెందిన చింతం లక్ష్మి(74) వ్యవసాయబావిలో పడి మృతిచెందింది. ఏఎస్సై లక్ష్మీరాజం తెలిపిన వివరాల ప్రకారం.. ఓదెల గ్రామానికి చెందిన చింతం లక్ష్మి రెండు సంవత్సరాల నుంచి కీళ్లనొప్పులతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయం కాలేదు. శుక్రవారం బహిర్భూమికి వెళ్లి బావిలో పడి మృతిచెందింది. మృతురాలి కుమారుడు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# అప్పుల బాధతో గొర్రెల కాపరి ఆత్మహత్య



మల్లయ్య (ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అప్పుల బాధతో గొర్రెల కాపరి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాగట్లపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై రమాకాంత్, గ్రామస్తుల వివరాల ప్రకారం.. రాగట్లపల్లికి చెందిన నెత్తెట్ల చిన్న మల్లయ్య(48) ఇల్లు నిర్మించుకునేందుకు, భూమిని అభివృద్ధి చేయడం కోసం సుమారు రూ.20 లక్షల వరకు అప్పులు చేశాడు. వ్యవసాయం, గొర్రెల పెంపకం ద్వారా ఆదాయం అంతంత మాత్రంగానే వస్తుండటంతో అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య సత్తవ్వ, కుమారుడు అజయ్, కూతురు అమ్ము ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.